# రోడ్లు ఇలా.. ప్రయాణమెలా?

● లింక్ రోడ్లను మర్చిపోయిన ప్రభుత్వాలు
● ఇబ్బందులుపడుతున్న రైతులు, ప్రజలు

**పెనుమంట్ర:** మండలంలోని మార్టేరు–తాడేపల్లి గూడెం స్టేట్‌హైవే రోడ్డుకు, నత్తారామేశ్వరం –పెనుగొండ, జుత్తిగ- తణుకు ఆర్‌అండ్ ప్రధాన రోడ్లకు జుత్తిగ నుంచి పెనుమంట్ర వరకు లింక్‌రోడ్డు ఉన్న రెండు కిలోమీటర్ల పొడవు ఉన్న జెడ్పీ రోడ్డు 14 ఏళ్లుగా ఎలాంటి పునర్నిర్మాణానికి నోచుకోకపోవడంతో ఆ రోడ్డున వెళ్లే పరిసర గ్రామ ప్రజలతో పాటు రైతులు, విద్యార్థులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2000 సంవత్సరం వరకు పుంత రోడ్లుగా ఉన్న ఈరోడ్లను 2004లో అప్పటి అత్తిలి ఎమ్మెల్యే దండు శివరామరాజు పెనుమంట్ర రజకపేట వద్ద గోస్తనీపై రూ. 49.06 లక్షలు నాబార్డు నిధులతో వంతెన నిర్మించి ఈ పుంతరోడ్డుకు మోక్షం కల్పించగా 2009లో అత్తిలి ఎమ్మెల్యేగా ఉన్న చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఈ లింక్ రోడ్డును కలుపుతూ వెలగలవారిపాలెం స్మశాన వాటిక వద్ద గోస్తనీపై రూ. 1.20 కోట్లతో మరో వంతెన, రోడ్డు నిర్మించి వెలగలవారిపాలెం పుంత, శ్మశాన వాటిక రోడ్డుకు మోక్షం కల్పించి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిచే ప్రారంభోత్సవం చేయించారు. దీంతో 40 ఏళ్లుగా ఆ పుంతరోడ్లలో ప్రయాణించే రైతులకు ప్రయోజనం చేకూరింది.



వర్షం వస్తే కాలువగా మారుతున్న జుత్తిగ- పెనుమంట్ర రజకపేట రోడ్డు (ఫైల్)



వెలగలవారిపాలెం- పెనుమంట్ర జెడ్పీ రోడ్డు దుస్థితి



రాళ్లు లేచిపోయిన జుత్తిగ- పెనుమంట్ర వెలగల వారి పాలెం లింక్ రోడ్డు

### విస్తరణ చేసినా పట్టించుకోని వైనం

సాధారణ పుంతరోడ్లుగా ఉన్న ఈ రోడ్లను భారీ వాహనాలు వెళ్లే విధంగా రహదారులు విస్తరణ చేయడంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరింది. అయితే ఈ రోడ్లకు 14 ఏళ్లుగా ఎటువంటి మరమ్మతులు చేయకపోవడంతో దగ్గర దారిగా ఉన్న ఈ రోడ్డున ప్రయాణించే ప్రయాణికులు నత్తారామేశ్వరం, వెలగలవారిపాలెం రో డ్లమీదుగా బ్రాహ్మణచెర్వు సెంటర్‌కు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. గత ప్రభుత్వం ఈ రోడ్డు మరమ్మతులకు రూ. 18 లక్షలు నిధులు కేటాయించిన కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకురాకపోవడంతో రూ. 85 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించి టెండర్‌ల దాకా వెళ్లినప్పటికీ ఎన్నికలు దగ్గర పడటంతో ఆ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచినా టెండర్ల ప్రకయ గురించి నోరు మెదపడం లేదు. ఇప్పటికైనా రోడ్లకు శాశ్వత మరమ్మతులు చేసి ఈ ప్రాంత రైతులు విద్యార్థులు ప్రయాణికుల వెతలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

### రేషన్ షాపుల తనిఖీ



రేషన్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

**నరసాపురం రూరల్:** మండలంలోని పలు రేషన్ దుకాణాలను తహసీల్దార్ రాజరాజేశ్వరి శుక్రవారం తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దర్బరేవు, మర్రితిప్ప గ్రామాలకు చెందిన 46,47 రేషన్ షాపుల్లో బియ్యం భారీ వ్యత్యాసాలు కనుగొని సదరు డీలర్లపై 6ఏ కేసులను నమోదు చేశారు. సివిల్ సప్లయిస్ డీటీ ఆయితం సత్యనారాయణ, ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### భర్త కనబడడం లేదని భార్య ఫిర్యాదు

**నరసాపురం రూరల్:** తన భర్త కనిపించడం లేదంటూ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మొగల్తూరు ఎస్సై జి.వాసు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వారతిప్ప గ్రామానికి చెందిన వాటాల ధర్మరాజు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే గత నెల 7న ఇంట్లో నుంచి వెళ్లిన ధర్మరాజు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల వద్ద గాలించారు. నెలరోజులైనా ధర్మరాజు ఆచూకీ లేకపోవడంతో భార్య భవాని పోలీసులను ఆశ్రయించింది.

## క్లుప్తంగా

### 12 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

**భీమవరం(ప్రకాశం చౌక్):** ఈ నెల 12 తేదీ నుంచి అపార్ ఐడీ జనరేషన్‌కు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు అపార్ ఐడీ జనరేషన్ చేయుటకు అవసరమైన ఆధార్‌కార్డు డేటా సవరణలకు అన్ని మండలాల, మున్సిపాలిటీల్లోని గ్రామ, వార్డు సచివాలయాల్లో 90 ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆధార్ సెంటర్లలో నవంబర్ 12 నుంచి 28 వరకు 15 రోజుల పాటు ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఆచంట రూరల్ 2, ఆకివీడు 4, అత్తిలి రూరల్ 3, భీమవరం రూరల్ 6, భీమవరం అర్బన్ 4, యలమంచిలి 4, గణపవరం 4, ఇరగవరం రూరల్ 3, కాళ్ల 4, మొగల్తూరు 4, నరసాపురం అర్బన్ 4, నరసాపురం రూరల్ 3, పాలకొల్లు రూరల్ 4, పాలకొల్లు అర్బన్ 3, పాలకోడేరు 3, పెంటపాడు 2, పెనుగొండ 3, పెనుమంట్ర 3, పోడూరు 4, తాడేపల్లిగూడెం రూరల్ 4, తాడేపల్లిగూడెం అర్బన్ 4, తణుకు రూరల్ 2, తణుకు అర్బన్ 6, ఉండి 3, వీరవాసరం 4 ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, తల్లితండ్రులు ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

### ఆకట్టుకున్న కార్తీక దీపాలంకరణ



కార్తీక దీపాలంకరణ చేస్తున్న విద్యార్థులు

**పాలకొల్లు సెంట్రల్:** కార్తీకమాసంలో దూపదీప నైవేధ్యాలు సమర్పించడం వల్ల మనసంతా ఆధ్యాత్మిక పరిమళాలతో నిండి అలౌకికమైన ఆనందం కలుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో కార్తీకమాస దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శివలింగం ఏర్పాటు చేసి వెయ్యి ప్రమిదిలలో స్వస్తిక్, త్రిశూలం, ఓంకారం, పద్మం ఆకారాల్లో దీపాలను వెలిగించారు. కళాశాల చైర్మన్ కేవీ నరసింహరావు, సెక్రటరీ కె.రామరాజు, ఏబీఎస్ మూర్తి, ఎన్.సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడల్లో వైఎన్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

**నరసాపురం రూరల్:** ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల పాలకొల్లు డీఎన్నార్ మహిళా కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ స్త్రీల బ్యాడ్మింటెన్ పోటీలలో వైఎన్ కళాశాల విద్యార్థులు 4వ స్థానం సాధించారు. ఈ పోటీల్లో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న బి.ధిల్లీశ్వరి, పి.దుర్గ, కె.రోజ పోటీల్లో పాల్గొని బహుమతులను సాధించారు. అలాగే ఇటీవల జరిగిన వివిధ క్రీడా పోటీల్లో కళాశాలకు చెందిన టి.రజిత, ఎండీ పరహాన్ కబడ్డీ, చెస్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ అంతర్ విశ్వవిద్యాలయ పోటీలు తమిళనాడులో జరగనున్నాయి. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, కోశాధికారి పోలిశెట్టి శ్రీరఘురామారావు, ప్రిన్సిపాల్ కనకారావు అభినందించారు.

### ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

**పాలకొల్లు సెంట్రల్:** మండలంలోని యాళ్లవానిగరువుకు చెందిన ఓ యువతి శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని యాళ్లవానిగరువు ప్రాంతానికి చెందిన బి.ప్రసన్న కుమారి (30) పట్టణంలోని ఓ సూపర్ మార్కెట్‌లో పని చేస్తుంది. ప్రసన్నకుమారి తండ్రి ప్రసాద్ టైలరింగ్ పనిచేస్తుంటాడు. తల్లి పని నిమిత్తం బయటకు వెళ్లింది. తన సోదరులిద్దరూ తనతోపాటు సూపర్‌మార్కెట్‌లో పనిచేస్తుంటారు. తనకు కొద్దిగా నీరసంగా ఉందని చెప్పి శుక్రవారం ఉద్యోగానికి వెళ్లకుండా ఇంట్లో ఉంది. ఈ నేపథ్యంలో అందరూ బయటకు వెళ్లిన తర్వాత కాసేపటికి ఇంటి పక్కనున్న స్థానికులు ఇంటికి వెళ్లి తలుపులు కొట్టగా ఎలాంటి స్పందన లేదు. దీంతో అనుమానం వచ్చి తలుపుల బద్దలుగొట్టి చూడగా ప్రసన్న కుమారి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఉంది. దీంతో వారు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తండ్రి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై జి.ప్రసాద్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**నరసాపురం రూరల్:** బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. మొగల్తూరు మండలం కేపీ పాలెం గ్రామానికి చెందిన ముంగండ జేజే బాబు, పిప్పళ్ల వారి తోటకు చెందిన పిప్పళ్ల నాగలక్ష్మి అనారోగ్యంతో ఆపరేషన్ జరగడంతో వారి కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సాయం అందింది.

# బలవంతపు సరుకుల కొనుగోళ్లు ఆపాలి

**పెనుగొండ:** మహిళా మార్టులలో బలవంతపు సరుకుల కొనుగోళ్లు ఆపాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తికి, తహసీల్దారు జి.అనితకుమారిలకు వినతి పత్రం సమర్పించారు. మహిళా మార్టుల్లో సంఘ సభ్యులతో బలవంతపు కొనుగోళ్లు చేయిస్తున్నారని ఆరోపించారు. ఏడు నెలలుగా వీఓఏలకు బకాయి పడిన వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు షేక్ పాదుషా, సీఐటీయూ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, గుర్రాల సత్యనారాయణ, వీఓఏలు జి.లక్ష్మీ ఎస్.శేషారత్నం, సీహెచ్ అనురాధ పాల్గొన్నారు.

**ఆచంటలో**

గత ఎనిమిది నెలలుగా వీఓఏలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను టీడీపీ కూటమి ప్రభుత్వం తక్షణం చెల్లించాలని సీఐటీయూ సీనియర్ నాయకుడు తలుపూరి బుల్లాబ్బాయి, తొటపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆచంట తహసీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించి, తహసీల్దారు జి.కనకరాజుకు వినతి పత్రం సమర్పించారు. కుసుమే జయరాజు, లక్ష్మీ పార్వతి, విజయ, సీహెచ్ లక్ష్మీ రేఖ, ఆరుపల్లి బేబి పాల్గొన్నారు.




పెనుగొండ ఎంపీడీఓకి వినతి పత్రం సమర్పిస్తున్న వీఓఏలు, సీఐటీయూ నాయకులు

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**పాలకొల్లు సెంట్రల్:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును గతంలో ఎవ్వరూ పట్టించుకోలేదని శ్రీ వెంకటేశ్వర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నర్రెడ్డి సూర్యనారాయణ (పండు) అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ భవనంలో కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి నాయకులు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు పరుస్తామని మాట ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇసుక పెద్ద సమస్యగా మారిందని, అందువల్ల భవన నిర్మాణ కార్మికులు పనులు లేకుండా పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్యలపై ఈ నెల 11వ తేదీ ఉదయం 9.30 గంటలకు జిల్లా కలెక్టర్, భీమవరం కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులు అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు యాతం కృష్ణ, సెక్రటరీ చొప్పా వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబ్జి, ట్రెజరర్ మైలవరపు శ్రీరామ్ బాబు, అబ్బిరెడ్డి నగేష్‌బాబు, పిడపర్తి సత్యం, పులపర్తి సర్వేశ్వరరావు, ఈమన దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**పాలకొల్లు అర్బన్:** ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవాలని తహసీల్దార్ ఎఫ్ఏ ఫాజిల్ కోరారు. పోడూరు మండలం జగన్నాథపురంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఖరీఫ్ పంటకు కామన్ వెరైటీ ధాన్యాలు క్వింటాల్‌కి రూ.2300, 75 కేజీల బస్తాకి రూ.1725లు, గ్రేడ్-ఏ రకం క్వింటాల్‌కి రూ.2320లు, 75కిలోల బస్తాకి రూ.1740లు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల్లో ధాన్యం కొనుగోలు సొమ్ములు రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. వరి కోతలు కోసిన రైతులు ధాన్యాన్ని తేమశాతం నిర్ధారించేందుకు ధాన్యం శాంపిల్స్‌ను రైతు భరోసా కేంద్రానికి తీసుకువెళ్లాలన్నారు. రైతులు తమ ధాన్యాన్ని వారికి ఇష్టమున్న మిల్లుకి విక్రయించుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీటీ కేపీ నాగదేవి, మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, ఆర్ఐ కందుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ ఎఫ్ఏ ఫాజిల్

# బ్యాడ్మింటన్‌లో యువతుల ప్రతిభ

**పాలకొల్లు సెంట్రల్:** విజయం సాధించాలనే తపన, కోరిక, పట్టుదల, కఠోర శ్రమ, ఆత్మ విశ్వాసం, గురువుల సహకారంతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ఉంటే ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. పట్టుదలతో తమ నైపుణ్యాలను వెలికితీసి భవిష్యత్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుకోవచ్చు. చిన్న చిన్న వేదికలపై విద్యార్థులు తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యాన్ని ఛేదించాలని పోరాటం చేస్తున్నారు. పాలకొల్లు దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ బ్యాడ్మింటన్ ఉమెన్స్ ఇంటర్ కళాశాల టోర్నమెంట్ మరియు యూనివర్సిటీ సెలక్షన్స్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల అభిప్రాయాలను తెలియజేశారు.



షటిల్ పోటీల్లో హోరాహోరీగా తలపడతున్న క్రీడాకారులు

### ఎస్సై కావాలన్నదే నా ఆశయం



గత 9వ తరగతి నుండి షటిల్ ఆడుతున్నాను. షటిల్‌తో పాటు వాలీబాల్ క్రీడలోనూ ప్రావీణ్యం ఉంది. గతంలో యూనివర్సిటీ పోటీల్లో మూడోస్థానంలో నిలిచాను. యూనివర్సిటీ పోటీల్లో సెలెకట్ అయ్యి స్పోర్ట్స్ కోటాలో ఎస్సై అవ్వాలనేది నా ఆశయం. ఆ మేరకు కృషి చేస్తున్నాను.

– భవాని, బీఏ తృతీయ సంవత్సరం, ఎస్‌కెఎస్‌డి ఉమెన్స్ కళాశాల, తణుకు

### టోర్నమెంట్‌లో ఆడడం మొదటిసారి



చిన్నతనం నుంచి షటిల్ ఆడుతున్నాను. త్రోబాల్‌లో కూడా ప్రావీణ్యం ఉంది. యూనివర్సిటీ సెలక్షన్స్‌లో సింగిల్స్, డబుల్స్‌లో విజయం సాధించాను. టోర్నమెంట్‌లో ఆడడం ఇదే మొదటిసారి. మొదటి పోటీలోనే విజేతగా నిలిచాను. పీడీ అవ్వాలనేది నా కోరిక. నా లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలని కృషి చేస్తున్నాను.

– పి.నాగలక్ష్మి, డిగ్రీ మొదటి సంవత్సరం, సీఆర్‌రెడ్డి కళాశాల, ఏలూరు

### పీడీ అవ్వాలనుకుంటున్నాను



గతంలో మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయి షటిల్ పోటీల్లో పాల్గొన్నాను. మండలంలో మొదటి స్థానం, జిల్లాలో మొదటి స్థానం, రాష్ట్రస్థాయిలో మూడవ స్థానంలో నిలిచాను. యూనివర్సిటీ పోటీల్లో ఇదే మొదటిసారి ఆడుతున్నాను. తన గోల్ పీడీ అవ్వాలని ఉంది. నా కోరిక నెరవేర్చుకోవాలనే సంకల్పంతో పోటీలో కష్టపడుతున్నాను.

– మౌనిక, డిగ్రీ మొదటి సంవత్సరం, డీఎన్నార్ కళాశాల, పాలకొల్లు

# స్కిల్ డెవలప్‌మెంట్‌కు శిక్షణలు దోహదం

**నరసాపురం రూరల్:** స్కిల్ డెవలప్‌మెంట్‌కు శిక్షణలు దోహద పడతాయని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. శుక్రవారం నరసాపురం మండలం రుస్తుంబాదలోని హస్తకళల ఎగుమతి ప్రోత్సాహక సంస్థ (ఈపీసీహెచ్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్ కన్వీనర్ కలవ కొలను నాగతులసీరావు అధ్యక్షతన జరిగిన వర్క్ షాపు ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిమాండ్‌కు తగ్గట్టుగా సరికొత్త టెక్నాలజీతో లేసు అల్లిక, ఉత్పత్తులను తయారు చేసినట్లు అయితే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. హస్తకళల అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణలక్ష్మి మాట్లాడుతూ మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలతో మేలు కలుగుతుందన్నారు. నెలరోజుల పాటు జరిగే క్రోచెట్ లేస్ క్రాఫ్ట్ డిజైన్ ప్రోగ్రాం, డెవలప్‌మెంట్ వర్క్‌షాపును శిక్షణా మహిళలు వినియోగించుకోవాలన్నార. కార్యక్రమంలో ఆల్ ఇండియా లేస్ ట్రేడ్ అధ్యక్షుడు కె.వీరాస్వామి (తాతాజీ), శ్రీరామ చంద్రుడు, రవీంద్ర గౌతమ్, ట్రైనర్ సుగుణరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసి రాజు

### రైతులకు అందుబాటులో ఉండాలి

**పెనుగొండ:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని పెనుగొండ తహసీల్దారు జి.అనితకుమారి అన్నారు శుక్రవారం వడలి రైతు సేవా కేంద్రంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తేమ శాతం పరీక్షలు నిర్వహించి 17 శాతం కన్నా తక్కువ ఉన్నపుడు మాత్రమే సంచి ఇవ్వాలని సూచించారు. ఏఓ పి.స్పందన, ఎంఎల్ఓ కె.రాధాకృష్ణ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితా సిద్ధం

**మొగల్తూరు:** తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితాను సిద్ధం చేశామని, అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియజేయాలని తహసీల్దార్ కె.రాజకిషోర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొగల్తూరు మండలానికి సంబంధించి 87 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్లు గుర్తించామని, సంబంధిత జాబితాను స్థానిక రెవెన్యూ కార్యాలయం, మండల పరిషత కార్యాలయం, ఎంఈఓ కార్యాలయం, స్థానిక ఉన్నత పాఠశాల నోటీస్ బోర్డుల్లో ఉంచామని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రచురణలో ఏమైనా అభ్యంతరాలుంటే లిఖిత పూర్వకంగా తెలియపర్చాలని కోరారు.



# ఉన్ని దుస్తుల సందడి షురూ

● పెరుగుతున్న చలిగాలులు
● స్వెట్టర్లు, మఫ్లర్లు, రగ్గులకు డిమాండ్

**పాలకొల్లు అర్బన్:** ప్రస్తుతం వర్షాలు తగ్గి చలి తీవ్రత పెరుగుతుంది. శీతాకాలంలో ఉన్ని వస్త్రాలకు గిరాకీ పెరుగుతుంది. చలి నుంచి ఉపశమనం పొందడానికి ఈ వస్త్రాలు బాగా ఉపకరిస్తాయి. దీంతో ప్రతీ ఒక్కరూ వీటి కొనుగోలు కోసం ఆసక్తి చూపుతూ ఉంటారు. ప్రతి ఏటా ఉత్తర ప్రదేశ్ నుంచి పలువురు చిరు వ్యాపారులు పాలకొల్లు పట్టణానికి వచ్చి నవంబరు, డిసెంబర్, జనవరి నెలల్లో ఉన్ని వస్త్రాలను విక్రయిస్తారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లలో ఈ ఉన్ని వస్త్రాల దుకాణాలను ఏర్పాటు చేసి వాటిని విక్రయించి ఉపాధి పొందుతారు.

**ఉత్తరప్రదేశ్ ఉన్ని వస్త్రాలకు డిమాండ్**

ఉత్తరప్రదేశ్‌లో తయారైన ఉన్ని వస్త్రాలకు మంచి డిమాండ్ ఉంటుంది. అప్పుడే పుట్టిన చంటి బిడ్డకి సరిపడా ఉన్ని వస్త్రం నుంచి అన్ని వయస్సుల వారికి, స్త్రీలు, పురుషులు అందరికీ సరిపడా ఉన్ని వస్త్రాలు వీరి దగ్గర లభిస్తాయి. అలాగే వర్షాకాంలో ఉపయోగించే రెయిన్‌కోటులు కూడా వీరు విక్రయిస్తున్నారు. శీతాకాలంలో మంచులో తిరిగితే జలుబు, ఇతర రుగ్మతలకు గురవుతారు. మంచు నుంచి ఉపశమనం పొందడానికి తల, చెవులు, ముక్కును కప్పుతూ టోపీలు (మంకీ కేప్), రగ్గులు, స్వెట్టర్లు విక్రయిస్తున్నారు.

**తగ్గిన వ్యాపారులు**

పాలకొల్లు పట్టణానికి గతంలో పది నుంచి 15 మంది వరకు వచ్చి దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందేవారు. కెనాల్‌రోడ్డు, లాకు సెంటర్, రత్నంటాకీస్ సెంటర్‌లో దుకాణాలు ఏర్పాటు చేసి ఉపాధి పొందేవారు. అయితే ఈ ఏడాది ఇద్దరు వ్యాపారులు మాత్రమే వచ్చారు. మరో నాలుగు రోజుల తరువాత మరికొంత మంది వ్యాపారులు వస్తారని ఉత్తరప్రదేశ్‌కి చెందిన లాలూసింగ్ చెబుతున్నారు.



పాలకొల్లు పట్టణంలోని లాకుల వద్ద రోడ్డు పక్కన విక్రయిస్తున్న ఉన్ని దుస్తులు

### మందకొడిగా విక్రయాలు

రెండు రోజుల క్రితమే ఉన్ని వస్త్రాల దుకాణం ఏర్పాటు చేశాం. ప్రస్తుతం అమ్మకాలు మందకొడిగా సాగుతున్నాయి. డిమాండ్‌ను బట్టి స్వెట్టర్లు రూ. 300 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నాం.

– పరభూత్ సింగ్, ఉన్ని వస్త్రాల విక్రయదారుడు